స్కూళ్లు ప్రారంభమయ్యేలోపే పనులు పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ఎంఈఓ పీపీ రాథోడ్‌ను వివరాలు అడుగుతున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

పటాన్‌చెరు టౌన్: పాఠశాలల ప్రారంభానికి ముందే అన్ని పనులను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల , వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు, అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా స్కూల్స్‌లోని తరగతి గదులను, కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫ్లోరింగ్, మరుగుదొడ్లు, నీటి వసతి తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్, ఎంఈఓ పీపీ రాథోడ్‌లతో పాఠశాలలలో జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రూ.23కోట్లతో 754 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసి వసతులు కల్పిస్తున్నామన్నారు.రూ. 6కోట్ల 50లక్షలు విడుదలయ్యాయన్నారు. 35 పాఠశాలల్లో పనులు పూర్తి చేశామన్నారు. పటాన్‌చెరు ,అమీన్‌పూర్ మండలాల్లోని పాఠశాలల్లో పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఎంఈఓ పీపీ రాథోడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, తహసీల్దార్ రంగారావు, గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్, కాంట్రాక్టర్ శ్రీను పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



నల్లగండ్లలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, పార్టీ నాయకులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలో దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్ గౌడ్ ,నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో ప్రధాని పదవిని చేపట్టి, ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజితా జగదీశ్వర్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గచ్చిబౌలి: రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శేరిలింగంపల్లి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలోని జిల్లా ఆస్పత్రిలో కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండాపూర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ హమీద్‌పటేల్

వినియోగదారులు నాణ్యతకు ప్రాధాన్యమిస్తున్నారు



సదస్సులో పాల్గొన్న అధికారులు, రైతులు

- రైతులు పురుగు మందుల వాడకం తగ్గించాలి
- ఏజీవర్సిటీ పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి

ఏజీవర్సిటీ: రైతులు ,రైతు ఉత్పత్తి సంఘాలు వీలైనంతవరకు పురుగు మందులు,రసాయ ఎరువుల వాడకాన్ని తగ్గించి మేలైన యజమాన్య పద్ధతులు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు పి రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో అమ్మకందారులు–కొనుగోలుదారుల సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తుల్ని సరైన సమయంలో సరైన విధంగా మార్కెట్లో అమ్ముకోవడం అనేది ప్రధాన సవాలు అని అన్నారు. ఇతర పరిశ్రమల్లో అధిక ఉత్పత్తి చేసినప్పుడు బోనస్ వస్తుందని కాని వ్యవసాయ రంగంలో ఒక్కోసారి అధిక ఉత్పత్తి కారణంగా నష్టాలు భరించాల్సి రావడం దురదృష్టకరమని, పంటలను నేలపాలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. త్వరగా పాడైపోయే టమాటలు, పూలు, కూరగాయలు వంటి ఉత్పత్తుల మార్కెటింగ్ జఠిలమైన సమస్య అని అన్నారు.భవిష్యత్తులో వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు కీలకపాత్ర పోషించనున్నాయని తెలిపారు. ముఖ్యంగా కొనుగోలు దారులు కొనే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల్ని ఎక్కడ పండించారు, ఎరువులు పురుగుమందుల్ని ఏ మేరకు వినియోగించారు అన్న అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని రైతులు ఈ విషయాన్ని గమనించాలని వారు సూచించారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సంచాలకులు లక్ష్మీబాయి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల్లో నాణ్యత, తాజాదనానికి ప్రాధాన్యమిస్తే మార్కెట్ చేసుకోవడం సులువు అని వివరించారు. కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల్ని ఆరు నెలల పాటు తమ శాఖ గిడ్డంగుల్లో నిల్వ చేసుకోవడానికి ఓ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఉమ్మడి నల్గొండ,మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన 10 ఉత్పత్తిదారుల సంఘాల రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు.నాబార్డ్ సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్ సీమ,వి సుధారాణి, ఐసీఏఆర్ డైరెక్టర్ రామన్ మీనాక్షి సుందరం, విస్తరణ విద్యా సంస్థ సంచాలకులు జగన్‌మోహన్ రెడ్డి, నాబార్డ్ ప్రతినిధి వినయ్‌కుమార్,ప్రాజెక్టు ప్రిన్సిపాల్ మధుబాబు ,రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రాత్రంతా రోడ్డుపైనే..

- ప్రయాణికులతో గోవా వెళ్లాల్సిన బస్సు..
- సౌకర్యాలపై అడిగితే ఠాణా ఎదుట నిలిపి పరారైన డ్రైవర్
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని ట్రావెల్స్ యాజమాన్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ట్రావెల్స్ బస్సులో కనీస సదుపాయాలపై అడిగితే...బస్సును రోడ్డుపైనే నిలిపి డ్రైవర్ ఉడాయించాడు. దీంతో ప్రయాణికులంతా రాత్రి రోడ్డుపైనే గడపాల్సి వచ్చింది. ఈ ఉదంతం రామచంద్రాపురంలో ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఓంశ్రీ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్ నుంచి గోవాకు వెళ్లేందుకు సోమవారం రాత్రికి 25 మంది ప్రయాణికులు టికెట్ బుక్ చేసుకున్నారు. ఎల్‌బీనగర్‌లో ట్రావెల్స్ నిర్వాహకులు ప్రయాణికులను పికప్ చేసుకోవాల్సి ఉండగా, మియాపూర్ వరకు రప్పించారు. తీరా ప్రయాణికులు వచ్చి బస్సు ఎక్కగా, కనీస సౌకర్యాలు లేకపోవడం, లోపల అపరిశుభ్రంగా ఉండటం, వైర్లు బయటకు కనబడుతుండగా కొంతమంది ప్రయాణికులు డ్రైవర్ దృష్టికి తీసుకెళ్లారు. సమాధానం ఇవ్వాల్సిన డ్రైవర్ నిర్లక్ష్యంగా, దురుసుగా ప్రవర్తించాడు. బస్సు రామచంద్రాపురం.. అశోక్‌నగర్ వద్దకు చేరుకోగానే డ్రైవరు వాహనాన్ని పక్కకు ఆపి దిగి వెళ్లిపోయే ప్రయత్నం చేశాడు. ప్రయాణికులు.. బస్సు నిర్వాహకుడు సునీల్‌కు ఫోన్ చేయగా అతను కూడా నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ మరో డ్రైవర్ వస్తాడని చెప్పాడు. కానీ మంగళవారం ఉదయం వరకు చూసినా ఎవరూ రాలేదు. దీంతో బస్సు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే వైజాగ్‌కు చెందిన చరణ్ వర్మ బుధవారం గోవాలో జరిగే ఇండియన్ కోస్ట్ గార్డు అసిస్టెంట్ కమాండెంట్ ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉండగా, ఈ ఉదంతంతో వెళ్లలేకపోయారు. దీంతో తోటి ప్రయాణికులు అందరూ కలిసి మంగళవారం రాత్రి గోవాకు వెళ్లేందుకు చరణ్ వర్మకు విమాన టికెట్‌ను బుక్ చేశారు. దీంతో ఆయన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



రామచంద్రాపురం పోలీసుస్టేషన్ ముందు ఆగిన బస్సు వద్ద ప్రయాణికులు



లింగంపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ జామ్

సా..గుతున్న ఫ్లైఓవర్

నిత్యం ట్రాఫిక్ జామ్‌లే.. • వానొస్తే ఇబ్బందులే... • రాంగ్‌రూట్‌తో తప్పని ప్రమాదాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని జ్యోతినగర్ కాలనీ నుంచి శేరిలింగంపల్లి పరిధిలోని చందానగర్ వరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీంతో రోజూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడడంతో గతంలో ఈ మార్గంలో ఫ్లైఓవర్‌ను మంజూరు చేశారు. అందుకు ప్రభుత్వం రూ.130 కోట్ల నిధులు మంజూరు చేసింది. 2022 అక్టోబర్‌లో ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంది. కాగా నిర్మాణ పనులు ప్రారంభించిన సమయంలో అనేక ప్రమాదాలు సైతం జరిగాయి. ఆ సమయంలో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పక్కనే రోడ్డును అభివృద్ధి చేశారు. కానీ మధ్యలో ఫ్లైఓవర్ పనులు నత్తకడకన సాగాయి. ముంబై జాతీయ రహదారి కావడంతో బస్సులు, భారీ వాహనాల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా ఈ మార్గంలో ప్రధానంగా ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ఇక దుమ్ముతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా లింగంపల్లి చౌరస్తా వద్ద వన్‌వే చేయడంతో భెల్ కాలనీ నుంచి వాహనదారులు అర కిలోమీటర్ దూరంలోని యూ టర్న్ వద్దకు వెళ్లకుండా వాహనాలపై రాంగ్‌రూట్‌లో వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం గంటల తరబడి వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. వర్షాలు పడిన సమయంలో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఇక వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే చందానగర్, లింగంపల్లి చౌరస్తాలలో ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా పిల్లర్లు నిర్మిస్తున్నారు. ఇవి పూర్తయిన వెంటనే వాటిపై గార్డర్లను ఎక్కిస్తారు.ఫ్లైఓవర్ పనులు సకాలంలో పూర్తి అవుతాయా లేదా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వాహనదారులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పిల్లర్ల నిర్మాణం

ఇబ్బందులు పడుతున్నాం



నిత్యం ఈ మార్గంలో ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది. ఉదయం, సాయంత్రం గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఫ్లైఓవర్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి.

– అల్తాఫ్, బీహెచ్‌ఈఎల్ వాసి

అక్టోబర్‌లోపు పూర్తి చేస్తాం

ఫ్లైఓవర్ నిర్మాణం సకాలంలో పూర్తి చేస్తాం. ఈ ఏడాది అక్టోబర్ నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొని వస్తాం. వాహనదారులు ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– రామకృష్ణ, డీఈ, ఆర్అండ్‌బీ

నేడు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం తెలంగాణ జీవ వైవిధ్యమండలి వారి ఆధ్వర్యంలో పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక, పోటీ పరీక్షలు నిర్వహించబడతాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జీవవైవిధ్య సంరక్షణ ప్రణాళికలో భాగస్వాములవుదాం అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించి వారు సహజ, రసాయన ,ప్లాస్టిక్ రహిత ఉత్పత్తులు వినియోగించే విధంగా ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటుకు వినతి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామపంచాయతీ నుంచి అల్లినగర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ నాయకులు మంగళవారం ఎంపీడీఓకి వినతిపత్రాన్ని అందించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చందనోత్సవం, ధ్వజారోహణ, జ్వాలా లక్ష్మీనరసింహస్వామి హోమం, లక్ష తులసి పూజ నిర్వహించారు. పూజ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు భార్గవ లక్ష్మీనరసింహస్వామి మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బైక్‌ని ఢీకొన్న టిప్పర్

పటాన్‌చెరు టౌన్: టిప్పర్ బైకును ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పటాన్‌చెరు మండలం పోచారం సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలం పోచారం సర్వీస్ రోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కొండాపూర్ మండలం... ఉత్తరపల్లికి చెందిన మహేందర్‌ను టిప్పర్ సోమవారం రాత్రి ఢీకొంది. దీంతో అతడు తీవ్రంగా గాయపడడంతో తొలుత పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 సిబ్బంది తరలించగా అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గాంధీకి వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కాలనీ వాసులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదిత్యనగర్‌లో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, మంచినీటి సమస్య, అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్ల పనులు, విద్యుత్ సమస్యలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, నాయకులు ఖాసీం, లియాఖత్ అలీ, ఇమ్రాన్, మహమ్మద్ అమీర్, మొహినుద్దీన్ పాల్గొన్నారు.

సిటిజన్స్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

శేరిలింగంపల్లి: నల్లగండ్ల సిటిజన్స్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ క్యాన్సర్ సంరక్షణలో విప్లవాత్మక పురోగతిని సాధించిందని ఆస్పత్రి రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వినీతరెడ్డి మంగళవారం తెలిపారు. కార్సినోమా అనోరెక్టమ్‌తో బాధపడుతున్న 58 ఏళ్ల మహిళకు విజయవంతంగా చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. మల్టీ డిసిప్లినరీ విధానం అత్యాధునిక సాంకేతికతతో ఏఓఐలోని రేడియేషన్ బృందం రోగి యొక్క అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన సంరక్షణను అందించిందన్నారు. అధునాతన పద్ధతులను ఉపయోగించి కణితి చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణజాలానికి హాని కలగకుండా తగ్గించగలిగామన్నారు. ఏఓఐ రీజనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ పి ప్రభాకర్ పాల్గొన్నారు.

భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్‌ఓ, జిల్లా కలెక్టర్ క్రాంతి తెలిపారు. మంగళవారం రుద్రారం గీతం యూనివర్సిటీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపరిచిన నారాయణఖేడ్ ,అందోల్ ,జహీరాబాద్ ,ఎల్లారెడ్డి ,కామారెడ్డి ,బాన్సువాడ ,జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీస్ భద్రత, సీసీ కెమెరాల పనితీరును, కంట్రోల్ రూమ్ రికార్డులను, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో నిమ్జ్ ప్రత్యేకాధికారి రవీందర్ రెడ్డి, సర్వేయర్ కోటేశ్వరావు, ఎఆర్‌ఓ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి కలెక్టర్ క్రాంతి



లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: ఫేర్ మీడియా, ఇండియన్ డిజైనర్స్ హాత్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రీమియం ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ మంగళవారం తాజ్‌కృష్ణా హోటల్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల చేనేత ఉత్పత్తులతోపాటు ప్రసిద్ధ డిజైనర్లు రూపొందించిన డిజైనరీ దుస్తులు, ఆభరణాలు ఈ ఎగ్జిబిషన్‌లో హైలెట్‌గా నిలుస్తాయని తెలిపారు. కళాత్మక, ప్రత్యేక శ్రేణి ఉత్పత్తులతోపాటు ఆభరణాలు, కుడ్య చిత్రాలు, హస్తకళలు, కళాఖండాలు, మట్టిపాత్రలు, చెక్కశిల్పాలు, క్యూరియస్, క్రిస్టల్, లెదర్, జాబ్, సిరామిక్ ఉత్పత్తులను ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాఘవేంద్రకాలనీ, ఏ,బీ బ్లాక్స్, గోపాల్‌రెడ్డినగర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఏపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో..

- గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధి ఏపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని ఏఈ వేణుగోపాల్ తెలిపారు.
- 11 కేవీ బ్రహ్మకుమారీస్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు బ్రహ్మకుమారీస్ కేంద్రం, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, రాక్ ఎన్‌క్లేవ్
- 11 కేవీ కొమరమ్ భీమ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు టీఎన్‌జీఓ కాలనీ, ఫేజ్ 1, 2 ప్రాంతాలలో..

శేరిలింగంపల్లిలో..

డైమండ్ హిల్స్, మంజీర ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ డైమండ్ హిల్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు డైమండ్ హిల్స్, సాయిరాం నగర్ కాలనీ, రాంకీ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.
- 11 కేవీ మంజీర ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు గోపన్‌పల్లి విలేజ్, మంజీర డైమండ్ హిల్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- దుర్గమాతా ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 02.00 గంటల వరకు శ్రీల విల్లాస్, ఎస్ఎంఆర్, వాటర్ వర్క్స్, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, సీబీసీఐడీ, బీఎస్ నగర్ ఫేజ్ 2, డైమండ్ హిల్స్, డ్రీమ్ వ్యాకాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మనూలో సోషియాలజీలో పోస్టుగాడ్యుయేషన్, పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తునకు గడువు జూన్ 30 అని 'మనూ' సోషియాలజీ విభాగాధిపతి డాక్టర్ కెఎం జియావుద్దీన్ మంగళవారం తెలిపారు. ఎంఏ సోషియాలజీకి మెరిట్ ప్రాతిపదికన 25 సీట్లతో ప్రవేశ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. పీహెచ్‌డీ కోర్సుకు అడ్మిషన్ ప్రవేశ పరీక్ష ప్రాతిపదికన ఉంటుందన్నారు. దీనికోసం మే 30 ఆఖరు అని తెలిపారు. ప్రవేశ పరీక్షను జూన్ 12వ తేదీన నిర్వహించడుతుందన్నారు. ఈ ఏడాది పీహెచ్‌డీ కోర్సు కోసం 15 సీట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఉర్దూ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలన్నారు. దరఖాస్తులు, ప్రాస్పెక్టస్‌లు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మరింత సమాచారం కోసం డాక్టర్ ఎహ్తిషామ్‌అక్తర్ (9811718473), డాక్టర్ హిలాల్ అహ్మద్‌వార్ (8341503410) ఫైసల్ అజీజ్ (9682619915), ఆసిమ్ సొహైల్ (9730407510)లో సంప్రదించాలన్నారు.

ఆరోగ్య సంరక్షణ సవాళ్లను అధిగమించాలి

ఈడబ్ల్యూబీజీ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మైక్‌చాన్



ట్రిపుల్ ఐటీ ఫ్యాకల్టీ, విద్యార్థులతో మైక్‌చాన్

రాయదుర్గం: భారతదేశ ఆరోగ్య సంరక్షణ సవాళ్లను మరింత ప్రభావవంతంగా అధిగమించాల్సిన అవసరముందని యూరోపియన్ వెల్‌నెస్ బయోమెడికల్ గ్రూప్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మైక్‌చాన్ అన్నారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం, ప్రత్యేక దృష్టి పెట్టడం, సహకారం పెంపొందించేందుకు ఈడబ్ల్యూబీజీ కృషి చేస్తుందన్నారు. సమర్థవంతంగా ఆరోగ్య సమస్యలు పరిష్కరించేందుకు అధునాతన చికిత్స, అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. స్టెమ్ సెల్ థెరపీ విధానం గురించి విద్యార్థులకు వివరించారు.యూరోపియన్ వెల్‌నెస్ భారత్ సీఈఓ డాక్టర్ రవితేజ్ అల్లం నూతన ఆవిష్కరణల ప్రాధాన్యతలను వివరించారు. మా వినూత్నమైన ఆవిష్కరణలను భారత్‌కు తీసుకరావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ట్రిపుల్‌ఐటీలో ఈడబ్ల్యూబీజీ బృందం సందడి

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో యూరోపియన్ వెల్‌నెస్ బయోమెడికల్ గ్రూప్ (ఈడబ్ల్యూబీజీ) బృందం సందడి చేసింది. మంగళవారం గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌ను ఈ బృందం సందర్శించింది.

సంతాప సభ

రాయదుర్గం: హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందిన ఇరాన్ అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీమ్ రైసీకి మనూలో మంగళవారం నివాళులు అర్పించారు. 'మనూ'లోని పర్షియన్ డిపార్ట్‌మెంట్ అండ్ సెంట్రల్ ఏషియన్ స్టడీస్ (డీపీ అండ్ సీఏఎస్)ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు .ఈ సందర్భంగా 'మనూ' వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ ఇరాన్ అధ్యక్షుడు రైసీ ఆధ్వర్యంలో భారత్–ఇరాన్ దేశాల మధ్య సత్సంబంధాలు కొనసాగాయని అన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 35, పచ్చిమిర్చి 60, బెండ 50, కాకర 60, దొండ 50, దోస 50, ఆలు 35, చామ 60, కీర 35, బీర 60, వంకాయ 40, గోకర 60, బీన్స్ 150, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 90, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 170, వెల్లుల్లి 270.

ఉచిత వైద్యశిబిరం

మోతీనగర్: మోతీనగర్ సమీపంలోని న్యూ సుల్తాన్‌నగర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మధుమేహం, బీపీ, చర్మ, దంత, గొంతు, కాళ్ల వ్యాధులతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. నీలిమ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి నెలా 9వ తేదిన గర్భిణులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో వైద్యులు నవీన్, చంద్ర, అనుపమ, సంతోష్, శ్రీ తేజ పాల్గొన్నారు.